క్లుప్తంగా

గృహజ్యోతి పత్రాల పరిశీలన

ముదిగొండ: గృహజ్యోతి పథకం ద్వారా నెలకు 200యూనిట్లు విద్యుత్ ఉచితంగా పొందుటకు వినియోగదారులు తమ ఆధార్‌కార్డ్, రేషన్ కార్డ్, ఫోన్ నంబర్‌కు అనుసందానం చేసుకోవాలని ముదిగొండ విద్యుత్‌శాఖ ఏఈ మేకపోతుల శ్రీనివాసరావు తెలిపారు. ముదిగొండలో జరుగుతున్న అనుసందాన కార్యక్రమాన్ని ఏడీఈ భీంసింగ్, ఏఈ శ్రీనివాసరావులు పరిశీలించారు. విద్యుత్ మీటర్ల రీడింగ్ ఆపరేటర్లు ఈ నెల 15లోపు నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

బీమా నగదు అందజేత

ఎర్రుపాలెం: మండలంలోని పెద్దగోపవరం సొసైటీకి చెందిన రైతు యరమల రమణారెడ్డి ఇటీవల మృతి చెందాడు. ఈయన పేరిట సొసైటీలో గ్రూప్ ఇన్సూరెన్స్ చేయించారు. దీంతో మంజూరైన రూ.50 వేల బీమా చెక్కును మృతుని భార్య శంకరమ్మకు మంగళవారం మండలకేంద్రంలోని సహకార బ్యాంకు కార్యాలయంలో సొసైటీ అధ్యక్షుడు శీలం అక్కిరెడ్డి, బ్యాంకు మేనేజర్ మగినం వీరభద్రంలు అందించారు. కార్యక్రమంలో సీఈఓ వీరారెడ్డి, సూపర్‌వైజర్ మహేష్, అసిస్టెంట్ మేనేజర్ నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు సహించం



సత్తుపల్లి రింగ్‌సెంటర్‌లో సీఐ కిరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తల్లాడ/సత్తుపల్లిటౌన్: సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోకుంటే సహించేది లేదని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తల్లాడ పోలీస్ స్టేషన్‌లో, సత్తుపల్లిలో సీఐ కిరణ్‌కు నాయకులు ఫిర్యాదు చేశారు. అనంతరం పలు చోట్ల నిరసన, ప్రదర్శన చేసి రింగ్‌సెంటర్లో ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సుధాకర్, నాగిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కృష్ణ, హరీష్‌రెడ్డి, ప్రసాద్, నాగేశ్వరరావు, నర్సిరెడ్డి, జోసఫ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూములు సర్వే



ముదిగొండలోని 179లో సర్వే చేస్తున్న అధికారులు

ముదిగొండ: ముదిగొండ రెవెన్యూలోని 179సర్వే నంబర్‌లో 21మంది యాదవులకు పట్టాలు ఇచ్చారు. తమకు ఇచ్చిన భూమిని ఆక్రమించారని సర్వేచేసి హద్దులు నిర్ణయించాలని ఇటీవల యాదవులు మండల, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయటంతో మంగళవారం సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో సర్వే ఏడీ శ్రీనివాసరావు, డీఐలు వెంకటేశ్వర్లు, లూర్దు, శ్రీనివాసరావు, ఆర్ఐ వహిధా, మండల సర్వేయర్ ఉమామహేష్‌లు పాల్గొన్నారు.

రోడ్డుపైకి రావొద్దు..

కల్లూరు: కల్లూరు సెంటర్‌లో ప్రధాన రహదారిపైన నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రమాదాల నివారణకై పోలీస్, గ్రామ పంచాయతీ అధికారులు మంగళవారం చర్యలు చేపట్టారు. హైవే రోడ్డుకు ఇరువైపులా వ్యాపారుల తోపుడు బండ్లు రోడ్డుపైకి ఎక్కకుండా రహదారినుంచి మూడుమీటర్ల వరకు ముగ్గుపోసి.. 24 గంటల్లో షాపులన్నీ ముగ్గు వెనకనే ఉండాలని సీఐ వెంకటేష్, ఎస్సై షాకీర్‌లు, ఈఓ సీహెచ్ కృష్ణారావులు హెచ్చరికలు జారీ చేశారు.

అర్చకసంఘం మండల కమిటీ ఎన్నిక

ముదిగొండ: మండల డీడీఎస్ అర్చక సంఘం మండల కమిటీ మంగళవారం ముదిగొండలో ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా మునగలేటి రమేష్‌శర్మ, కార్యదర్శిగా రొంపిచర్ల కిషోరాచార్యులు, కోశాధికారిగా ముడుంబా చక్రవార్యులు, ప్రచార కార్యదర్శిగా బిజుమళ్ల రాధకృష్ణశాస్త్రి, సహాయ కార్యదర్శిగా చీమకుర్తి నాగాచారి, సలహాదారుడిగా బాణాల పోతులూరయ్యాచారిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కళారంగానికి తీరని లోటు

మధిరరూరల్: నాగవరప్పాడు గ్రామానికి చెందిన రంగస్థల కళాకారుడు పిల్లి వెంకయ్య (80) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మంగళవారం మధిర రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్, మాటూరుపేట శ్రీ సీతారామాంజనేయ కళాపరిషత్ అధ్యక్షుడు గడ్డం సుబ్బారావు సందర్శించి నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన మృతదేహాన్ని సందర్శించిన వారిలో మాజీ సర్పంచ్, కళాకారుడు చావలి రామరాజు తదితరులు ఉన్నారు.

రీడింగ్ సిబ్బందికి అవగాహన

మధిర: విద్యుత్‌శాఖ మధిర సబ్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం మధిర, ఎర్రుపాలెం మండలాల స్పాట్ బిల్లర్స్ (మీటర్ రీడర్స్)కు గృహజ్యోతి పథకంపై అవగాహన కల్పించారు. విద్యుత్ శాఖ వైరా డివిజన్ డీఈ ఎన్.కృష్ణ పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రతిష్టాత్మకంగా అమలు చేయబోయే గృహజ్యోతి పథకానికి సంబంధించి లబ్ధిదారుల నుంచి సంబంధిత సమాచారం సేకరించే ప్రక్రియలో భాగంగా ఈ సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్హులందరికీ ఈ పథకం కింద లబ్ధి చేకూరేవిధంగా వారి ఆధార్, రేషన్ కార్డు (ఫుడ్ సెక్యూరిటీ కార్డు), సెల్ ఫోన్ నంబర్ సేకరించి సంబంధిత వినియోగదారుని విద్యుత్ సర్వీస్ నంబర్‌కు అనుసంధానం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మధిర సబ్ డివిజన్ ఏడీఈ ఎం.అనురాధ, అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్ శివాని, మధిర పట్టణ, రూరల్ ఏఈలు ఎస్.అనీల్ కుమార్, కె.నాగేశ్వరరావుతో పాటు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మధిర: మాట్లాడుతున్న డీఈ కృష్ణ

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి..

తల్లాడ: మీటర్స్ రీడర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మంగళవారం తల్లాడ ఉప విద్యుత్ రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. తల్లాడ మండలంలో మొత్తం 44,170 విద్యుత్ సర్వీసులుండగా 9 మంది మాత్రమే బిల్ రీడర్లు ఉన్నారని, గృహజ్యోతి పథకం ద్వారా రేషన్ కార్డ్, ఆధార్‌కార్డ్, ఫోన్ నంబర్ అనుసందానం ప్రభుత్వం తమకే అప్పగించిందని, ఇది అదనపు భారం అని వాపోయారు. దీనికి అదనపు వేతనం ఏమి ప్రకటించలేదన్నారు. దీంతో తమకు పని ఒత్తిడి మరింత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండలంలో విద్యుత్ బిల్ రీడర్లు పాల్గొన్నారు.



తల్లాడ ఉప విద్యుత్ రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బిల్లింగ్ రీడర్లు

సర్వీస్‌రోడ్ వేయాలంటూ రైతుల ధర్నా

సత్తుపల్లి: రైతుల వ్యవసాయ ఉత్పత్తులను తరలించుకునేందుకు సదాశివునిపాలెం–భీమవరం మధ్య సర్వీస్‌రోడ్‌లను వేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలంటూ ఆ ప్రాంత రైతులు మంగళవారం సదాశివునిపాలెం అండర్‌పాస్‌బ్రిడ్జి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తుంబూరు మహేశ్వర్‌రెడ్డి, వినుకొండ కృష్ణ, కాలినేని రాజేష్, ఆళ్ల నాగేశ్వరరావులు మాట్లాడుతూ.. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మించేటప్పుడు సదాశివునిపాలెం నుంచి తుంబూరు వరకు మూడు అండర్‌పాస్ బ్రిడ్జీలు కేవలం ఏడు అడుగుల ఎత్తులోనే నిర్మించారని, దీనిపై అప్పట్లో రైతులందరు ఆందోళనలు చేస్తే కాంట్రాక్టర్ వచ్చి సర్వీస్‌రోడ్ వేస్తామని స్పష్టంగా హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించామన్నారు. అండర్‌పాస్‌లు ఏడు అడుగుల ఎత్తులో ఉండటం వల్ల కనీసం వ్యవసాయ పనులకు ఉపయోగించే ట్రాక్టర్లు, హార్వేస్టర్లు వెళ్లలేని దుస్థితి నెలకొందని.. పనులన్నీ ముగింపు దశకు వస్తున్నప్పుడు హామీలు నెరవేర్చాలనే డిమాండ్‌తో ఆందోళనలు చేస్తున్నామన్నారు. సుమారు గంటపాటు జరిగిన ధర్నాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సత్తుపల్లి పట్టణ సీఐ కిరణ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కంపెనీ ప్రతినిధులు సర్వీస్‌రోడ్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు.



సదాశివునిపేట వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

కిష్టారం వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం

సత్తుపల్లి: మండలంలోని కిష్టారం సొసైటీ వైస్ చైర్మన్ మోదుగు పుల్లారావుపై అవిశ్వాసానికి తొమ్మిది మంది డైరెక్టర్లు డీఎస్‌ఓకు నోటీసులు ఇవ్వటం రాజకీయంగా చర్చానీయాంశమైంది. కిష్టారం సొసైటీ ఎన్నికలప్పుడు కిష్టారం గ్రామానికి 7, యాతాలకుంట గ్రామానికి 3, చెరుకుపల్లి గ్రామానికి 3 డైరెక్టర్లు చొప్పున రాజకీయాలకు అతీతంగా కాంగ్రెస్, టీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సొసైటీ చైర్మన్ పదవికి అందరిని ఒప్పించి మాజీ సర్పంచ్ మామిళ్లపల్లి కృష్ణయ్యను ఏకగ్రీవకంగా ఎన్నుకోగా.. వైస్ చైర్మన్‌గా యాతాలకుంట మోదుగు పుల్లారావును ఎంపిక చేశారు. మామిళ్లపల్లి కృష్ణయ్య, మోదుగు పుల్లారావు ఇద్దరు బీఆర్‌ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నారు. మోదుగు పుల్లారావు సొసైటీ వైస్ చైర్మన్‌తో పాటు ఎస్సీ కోటాలో డీసీసీబీ నామినేటెడ్ సభ్యుడిగా ఎడాదినుంచి కొనసాగుతున్నారు. అయితే ఇతను రైతులకు అందుబాటులో లేకుండా, విధులపట్ల నిర్లక్ష్యంగా పనిచేస్తూ.. నచ్చజెప్పినా వినకపోవడంతో అతనిపై అవిశ్వాస తీర్మాణం పెడుతున్నామని 9మంది డైరెక్టర్లు ఈ నెల 3న ఖమ్మం డీసీఓకు నోటీస్ అందించారు. దీనిపై స్పందించిన డీసీఓ రెండు, మూడురోజుల్లో 13 మంది సభ్యులకు అవిశ్వాసం నోటీసులు పంపిస్తామన్నారు. అయితే బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మోదుగు పుల్లారావును రాజకీయ కక్షతోనే భాగంగానే అవిశ్వాసం పెడుతున్నారని బీఆర్‌ఎస్ పార్టీ నేతలు తెలుపగా.. ఎన్నికల సమయంలో పుల్లారావు కాంగ్రెస్ పార్టీ నాయకులపై దౌర్జన్యం చేయడంతోనే అవిశ్వాస తీర్మానం పెట్టాల్సి వచ్చిందంటూ కాంగ్రెస్ పార్టీ బదులిస్తుంది.

మార్కెట్‌లోకి రెనాల్ట్ 'కైజర్'



కారును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ వెంకటపుల్లయ్య

సత్తుపల్లి: సత్తుపల్లిలోని రెనాల్ట్ షోరూంలో కైజర్ కారును ఎంపీపీ సంగం వెంకటపుల్లయ్య మంగళవారం ఆవిష్కరించి మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈసందర్భంగా కారు ప్రత్యేకతలను కంపెనీ సీఈఓ ఆర్.కిరణ్‌కుమార్, బీఎం నిమ్మగడ్డ శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాధిరి మధు, అద్దంకి అనిల్, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలకు వినతి

తల్లాడ: తల్లాడ సొసైటీలో అవినీతిపై విచారణ జరపాలని మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కాపా సుదాకర్, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్, సీనియర్ నాయకులు కాపా రామారావు, అప్పయ్య తుమ్మలకు ఖమ్మంలో వినతిపత్రం అందించారు. సొసైటీ వారు రైతులకు తెలియకుండా వారి ఎకౌంట్లో నగదు జమచేసి.. వాటిని కాజేసీ తిరిగి కట్టాలని రైతులకు నోటీసులు పంపిస్తున్నారని.. దీనిపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, మహేష్, గుండ్ల వెంకటేశ్వర్లు, నేలపల్లి రాంబాబు, షేక్ జమాల్ పాల్గొన్నారు.

కూనంనేనికి..

కొణిజర్ల: మండలంలోని పలు గ్రామాల సమస్యలు ఈ నెల 8 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి పరిష్కారానికి నిధుల మంజూకు కృషి చేయాలని కోరుతూ.. కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు సీపీఐ మండల కార్యదర్శి వేములకొండ రమేష్ వినతిపత్రం అందించారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో కూనంనేని నివాసంలో ఆయనని కలిసి మండల సమస్యలను ప్రస్తావిస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సొసైటీ డైరెక్టర్ పాపగంటి సుదర్శన్ ఉన్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన ఎంపీటీసీ



పొంగులేటిని కలిసిన ఎంపీటీసీ శ్రీలక్ష్మి

ఎర్రుపాలెం: మండలంలోని చిన్న బీరువల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ చంద్ర శ్రీలక్ష్మి ఆమె భర్త చంద్ర కిరణ్‌లు మంగళవారం తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా హైదరాబాదులో మినిస్టర్ క్వార్టర్స్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామానికి సంబంధించిన అభివృద్ధి పనుల విషయమై మంత్రికి తెలుపగా.. ఆయన సానుకూలంగా స్పందించి అభివృద్ధికి సహాయపడతానని తెలిపారని అన్నారు.

9 నుంచి కబడ్డీ పోటీలు

మధిర: రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఈ నెల 9 నుంచి 11 వరకు ఎన్టీఆర్ జిల్లా, గంపలగూడెం మండలం, చింతలనర్వ గ్రామంలో కబడ్డీ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.20వేలు, 2వ బహుమతి రూ.15వేలు, 3వ బహుమతి రూ.13వేలు, 4వ బహుమతి రూ.10వేలు, 5వ బహుమతి రూ.8వేలు ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 9లోగా ఎంట్రీలు పంపాలని, ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి కబడ్డీ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఎంట్రీలను గద్దల రవితేజ 7780783678 నంబర్‌కు పంపాలని కోరారు.

రెగ్యులర్ చేయాలి

ఎర్రుపాలెం: గురుకుల, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలల్లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులను, సిబ్బందిని ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరావు, జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలీ డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రంలోని గురుకుల, కేజీబీవీ పాఠశాలలను వారు సందర్శించారు. సిబ్బంది, ఉపాధ్యాయులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బందారు నాగరాజు, అనుమోలు కోటేశ్వరరావు, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్, మండల ప్రధాన కార్యదర్శి అనుమోలు కోటేశ్వరరావు తదితరులున్నారు.

కంటి వైద్య శిబిరం

బోనకల్: మండలంలోని ఆళ్లపాడు గోవిందాపురం గ్రామంలో మీనాక్షి కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆస్పత్రి కంటి డాక్టర్ కె.శ్రీధర్ గౌడ్ 100 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కందుల పాపారావు, బుంగ రాములు తోటకూర వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ద్విచక్ర వాహనాలకు బహిరంగ వేలం

కారేపల్లి: నాటుసారా, బెల్లం ద్విచక్రవాహనాలపై తరలిస్తూ పట్టుబడిన నింధితులపై కేసు నమోదు చేయటంతో పాటు, వారి నుంచి స్వాధీనపర్చుకొన్న ద్విచక్రవాహనాలకు కారేపల్లి ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కారేపల్లి క్రాస్‌రోడ్డు ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఎక్సైజ్ శాఖ ఏఈఎస్ వేణుగోపాల్, సీఐ జుల్ఫికర్ అహ్మద్, ఎస్సై వసంతలక్ష్మిల ఆధ్వర్యంలో 9 ద్విచక్రవాహనాలకు బహిరంగ వేలం నిర్వహించగా, రూ.3.31లక్షల ఆధాయం వచ్చింది. వేలంలో దక్కించుకున్న వాహనాలను తీసుకెళ్లే సమయంలో 18.5 జీఎస్టీ విధించినట్లు సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపారు.

'సాయిస్ఫూర్తి' కళాశాల సందర్శన

సత్తుపల్లిరూరల్: గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో బీఫార్మసీ కోర్సు ఏర్పాటుకు మంగళవారం కళాశాలను ఒంగోలు ఆంధ్రకేశరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అంజిరెడ్డి, అకాడమిక్స్ సెంట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్‌వీఎస్ రాజు, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణమోహన్‌లు సందర్శించి కళాశాల వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ దాసరి ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శేషారత్నకుమారి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

కారేపల్లి: ఈ నెల 16 తేదీన కార్మికుల సమస్యలపై నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటామని ఆశా కార్యకర్తలు కారేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సురేష్‌కు సమ్మె నోటీస్ అదజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్మిక సంఘం మండల కార్యదర్శి కె.నరేంద్ర, ఆశావర్కర్ల యూనియన్ నాయకులు కమల, కల్యాణి, శారద, పద్మ, దేవకరుణ పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిని పెంచాలి



పశువులకు చికిత్స చేస్తున్న వైద్యులు

మధిరరూరల్: వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉండే పాడి పరిశ్రమను అభివృద్ధి చేసి రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలని పశు వైద్యశాఖ జిల్లా సహాయ సంచాలకులు డాక్టర్ భాను, డాక్టర్ పండరిబాబు తెలిపారు. మండల పరిధిలోని ఖమ్మంపాడు, చిలుకూరు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పశువైద్య శిబిరాలు విజయవంతమయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం, హైదరాబాద్ పశువైద్య కళాశాల, జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకంలో భాగంగా పశువైద్య శిబి రాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరాల్లో కళాశాల అధ్యాపక బృందం డాక్టర్ జ్యోతి, డాక్టర్ స్రవంతి, డాక్టర్ శివ నాగ పావని పాల్గొని ఎదకు రాని పశువులకు చూడి పరీక్షలు, అత్యాధునికమైన పరికరాలతో గర్భకోశ వ్యాధి పరీక్షలు, మూత్ర పరీక్షలు, రక్త పరీక్షలు, పేడ పరీక్షలు శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించి చికిత్స చేశారు. పాడి రైతులకు ఉచితంగా ఖనిజ, లవణ మిశ్రమం, మందులను పంపిణీ చేశారు. మండల పశు వైద్యాధికారి కృష్ణారెడ్డి, లైవ్ స్టాక్ ఆఫీసర్ లక్ష్మణరావు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో టాస్క్ శిక్షణ

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో మంగళవారం టాస్క్ వారి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. టాస్క్ కోఆర్డినేటర్ కె.దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణలో శిక్షకుడు బి.బాలూ ప్రవరాఖ్య, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ బి.హరీష్‌లు గిరిజన బాలికలకు కేరీర్ గైడెన్స్‌పై శిక్షణ ఇచ్చారు. విద్యార్థినులు డిగ్రీ తర్వాత పలు పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కోవాలి తదితర విషయాలను వివరించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం శిక్షకులను ఘనంగా సత్కరించారు.

వన మహోత్సవం..

గురుకుల బాలికల డిగ్రీ కళాశాలలో మంగళవారం వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.మానస విద్యార్థినులతో కలిసి కళాశాల ఆవరణలో 50 రకాల మొక్కలు నాటించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న కళాశాల సిబ్బంది

రహదారి భద్రతా నియమాలు పాటించండి

సత్తుపల్లిటౌన్: ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలను పాటించాలని సత్తుపల్లి ఎంపీపీ సంగం వెంకటపుల్లయ్య కోరారు. రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా మంగళవారం సత్తుపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం భద్రత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం యాకోబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరామర్శ..

కొణిజర్ల: ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొంది తన స్వగ్రామమైన తెల్దారుపల్లిలో విశ్రాంతి తీసుకుంటున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను కొణిజర్ల మండల సీపీఎం నాయకులు భూక్యా వీరభద్రం, వెంకటేశ్వర్లు, దొనకొండ ముత్తయ్య తదితరులు ఆయనను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

బెస్ట్ ఆశావర్కర్‌కు సన్మానం

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం పీహెచ్‌సీలో పనిచేస్తున్న కంచి రాజేశ్వరికి కలెక్టర్ వీపీ గౌతమ్ చేతుల మీదుగా బెస్ట్ ఆశా వర్కర్‌గా అవార్డు అందుకోవటం పట్ల మంగళవారం పీహెచ్‌సీలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేసి భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మటూరి రామకృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి తడికమళ్ల యోబు, సెకండ్ ఏఎన్‌ఎంలు కృష్ణవేణి, సుమలత, మాధవి, రామాదేవి, అధికారులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అసమానతలు లేని విద్య ప్రభుత్వ బాధ్యత

ఏన్కూరు/కొణిజర్ల: అసమానతలు లేని విద్య కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని టీపీటీఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి గరిక శ్రీనివాస్, టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పీవీఆర్‌కే ప్రసాదరావు తెలిపారు. ఫిబ్రవరి 11,12 తేదీల్లో టీపీటీఎఫ్ అధ్వర్యంలో జరిగే విద్యా, వైజ్ఞానిక మహసభలను జయప్రదం చేయాలని మంగళవారం మండలంలోని అన్ని పాఠశాలలను సందర్శించారు. విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ మహాసభలకు డిప్యూటి సీఎం మల్లు బట్టి విక్రమార్క మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క హాజరువుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటప్పయ్య, ఫ్రాన్సిస్, నాయకులు సుమలత, నాగేశ్వరరావు, సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ఖాసీమ్‌పాషా, బాధ్యులు వీరాచారి, డి.వెంకటేశ్వర్లు, శంకర్, దేవ సహాయం తదితరులు పాల్గొన్నారు.



ఏన్కూరు: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

వితరణల వెల్లువ..

పీహెచ్‌సీకి కుర్చీలు..

కొణిజర్ల: కొణిజర్ల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి పరిశ సీతారత్నం ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ పరిశ పుల్లయ్య 25 కుర్చీలను వితరణగా అందజేశారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన కుర్చీలను పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాధాకృష్ణ సమక్షంలో సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ మధుసూధనరావు, స్టాఫ్‌నర్స్ పద్మ, మల్లిఖార్జునరావు, రిజ్వానా, వరమ్మ, సుగుణ, రమణ, గీత, దివ్య, రాధాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు

పాఠశాలకు..



పాఠశాలకు కుర్చీలు అందజేస్తున్న ఉపాధ్యాయుడు

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలకు ఆ పాఠశాల ఉపాధ్యాయుడు గంతాల శివకుమార్ రూ.4వేల విలువ చేసే ఆరు కుర్చీలను వితరణ చేశారు. ఈ కుర్చీలను మాజీ సర్పంచ్ జంగా పుల్లారెడ్డి, సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డి చేతుల మీదుగా హెచ్‌ఎం జంగా గురునాధరెడ్డికి అందించారు.

అంగన్‌వాడీకి బీరువా..

కారేపల్లి: మండలంలోని గాదెపాడు అంగన్‌వాడీ కేంద్రానికి విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు సీతామహాలక్ష్మి బీరువాను మంగళవారం వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ సుభద్ర, అంగన్‌వాడీ టీచర్స్ షేక్.మహబూబి, రాణేమ్మ, ఉపాధ్యాయులు గుత్తా శ్రీనివాసరావు, తావుర్యా, మత్రు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ..

ఎర్రుపాలెం: మండలంలోని కొత్తపాలెం, రేమిడిచర్ల గ్రామాల్లోని చర్చిల్లో మంగళవారం రూ.70వేల విలువైన దుస్తులు, ఆహార సామగ్రి కిట్లను 100 మంది పేద క్రైస్తవులకు షేర్ ది విజన్ సంస్థ చైర్మన్ పాదిల నారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో గ్రామాల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు కార్యాచరణ తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్లు అనీల్ కుమార్, మాతంగి బాబు, సంస్థ సభ్యులు వీరబాబు, సుమన్ బాబు, నరేష్, రత్న బాబు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధి సాధించాలి

చింతకాని: విద్యార్థులు కష్టపడి చదువుతూ విద్యాభివృద్ధి సాధించాలని గ్రామ మాజీసర్పంచ్ నారపోగు కొండలరావు తెలిపారు. మండలంలోని సీతంపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాత, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, ఖాదర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేష్, గ్రామపెద్దలు బాబు, వీరబాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకాకూడదనే..



విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న భూమేశ్వరరావు

కొణిజర్ల: చదవుకు పేదరికం అడ్డు రాకూడదని తల్లి లేక తండ్రిలేని వారికి లక్ష్మీదేవి ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ట్రస్టు ద్వారా వారు చదివినంతకాలం ఉచిత విద్యను అందిస్తామని వైరా న్యూలిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల అధినేత పోతినేని భూమేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని పల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాల బాలికలకు సాయంత్రం పూట అదనపు తరగతుల నిమిత్తం అల్పాహార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి.. రూ.15 వేలు వితరణ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.సుజాత, ఉపాధ్యాయులు గుల్జార్ బేగం, డీవీఎస్ రావు, రామన అచ్చుత్, సంక్రాంతి రవికుమార్, ఉష, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



చింతకాని: మాట్లాడుతున్న పోటు ప్రసాద్

చింతకాని/ఎర్రుపాలెం: కార్మిక వర్గ వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ ఈ నెల 16న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు తెలిపారు. చింతకాని, ఎర్రుపాలెం మండల కేంద్రాల్లోని సీపీఐ కార్యాలయాల్లో మంగళవారం నిర్వహించిన పార్టీ మండల సమావేశంలో వారు మాట్లాడారు. గత పదేళ్లుగా మోదీ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించటంలో ఘోరంగా విఫలమైందని, వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే మోదీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతుందన్నారు. ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న మోదీ ప్రభుత్వానికి పతనం తప్పదని తెలిపారు. సమ్మెలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. గత టీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా రేషన్ కార్డులను ఇవ్వలేదని.. ఈ క్రమంలో రేషన్ కార్డు ప్రతిపాదికన 200 యూనిట్లు విద్యుత్ వినియోగించే పేదలకు గృహజ్యోతి పథకం అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావించడం సరైన నిర్ణయం కాదన్నారు. అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులిచ్చిన తర్వాతనే గృహజ్యోతి పథకం అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి, మండల కార్యదర్శి మల్లికార్జున్‌రావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పగిడిపల్లి ఏసు, కూచిపూడి రవి, రాసాల మోహన్‌రావు, అబ్బూరి మహేష్, మండల సహాయ కార్యదర్శి గోపాలరావు, మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య, నాయకులు గొల్లపూడి కోటేశ్వరరావు, గామాసు జోగయ్య, సగ్గుర్తి సంజీవరావు, కోటి సుబ్బారెడ్డి, దూదిగం బసవయ్య, నల్లమోతు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.